


Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 348 | మంగళవారం 07 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

**- ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ**
**- గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్**
**- ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన - మిగతా 2లో..

### మహారాష్ట్రలో భారీ వర్షాల

# బీభత్సం...

**- ముంబై--పుణే రైల్వే మార్గంలో కొండచరియలు.**
**- రైళ్ల రాకపోకలు నిలిపివేత..**
**అత్యవసర సమీక్ష నిర్వహించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్**

ముంబై - సూర్య వాస్తవం

మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముంబై--పుణే ఘాట్ సెక్షన్‌లో రైల్వే ట్రాక్‌లపై భారీగా కొండచరియలు విరిగిపడటంతో పాటు బండరాళ్లు, మట్టి పేరుకు పోవడంతో ఈ కీలక రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే మార్గా ల్లో ఒకటైన ముంబై--పుణే మార్గంలో రైళ్లు నిలిచి పోవడంతో వేలాది మంది ప్రయా ణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని గమనించిన రైల్వే అధికారులు పలు రైళ్లను దారి మళ్లించగా, మరికొన్ని రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. పరిస్థితిపై కేంద్ర



రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అత్యవసర సమీక్ష నిర్వహించి ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఘటనా స్థలంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రైల్వే ట్రాక్‌లపై పడిన కొండచరియలు, బండరాళ్లు, మట్టిని యుద ప్రాతిపదికన తొలగించి రాక పోకలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు రైల్వే రెస్క్యూ బృందాలు భారీ యంత్రాలతో సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు రైల్వే శాఖ అధికారిక ప్రకట నలను గమనిస్తూ, ప్రయాణాలకు ముందు రైళ్ల సమయాలపై తాజా సమాచారం తెలుసుకోవాలని అధికారులు సూచించారు.



## కిష్టవార్‌లో క్లౌడ్‌బరస్ట్

**- కొండచరియలు విరిగిపడి రహదారులు మూసివేత**

శ్రీనగర్- సూర్య వాస్తవం

జమ్మూకశ్మీర్‌లోని కిష్టవార్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా క్వార్ జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో క్లౌడ్‌బరస్ట్ సంభవించింది. ఈ ఘటనతో భారీ ఎత్తున కొండచరియలు విరిగిపడి, ప్రాజెక్టు ప్రాంతమంతా బురద, రాళ్లు, శిథిలాలతో నిండిపోయింది. కొండచరియలు విరిగిపడటంతో ప్రాజెక్టు వద్ద నిలిపి ఉంచిన అనేక వాహనాలు, ట్రక్కులు, ట్యాంకర్లు బురదలో చిక్కుకుపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జమ్మూ--కిష్టవార్ జాతీయ రహదారిపై కూడా మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో - మిగతా 2లో..

### పేదలు, మైనారిటీల ఓటు హక్కును లాక్కోవడానికా

# ప్రతిపక్ష పార్టీల కుట్ర

**- సీఎం డి.కె. శివకుమార్**
**- విధాన సౌధ ప్రాంగణంలో శివకుమార్ మీడియా ప్రశ్నలకు సమాధానం**

బెంగళూరు - సూర్య వాస్తవం

"ఎస్ఐఆర్ ప్రక్రియను మేము వ్యతిరేకిస్తున్నప్పటికీ, ప్రజల ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి మా ప్రభుత్వం వారిలో అవగాహన కల్పిస్తోంది. ఇది ఎన్నికల సంఘం ప్రక్రియ, ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదు. కానీ పేదలు, మైనారిటీల ఓటు హక్కును లాక్కోవడమే ప్రతిపక్ష పార్టీల కుట్ర," అని సీఎం డీకే శివకుమార్ ఎదురుదాడి చేశారు. సోమవారం విధాన



సౌధ ప్రాంగణంలో శివకుమార్ మీడియా ప్రశ్నలకు సమాధాన - మిగతా 2లో..

# విశాఖలో 'బే సిటీ'..

**- అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు : అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం**
**- విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సమీక్ష**
**- ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం**
**- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక**
**- 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం**
**- మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు**




అమరావతి- సూర్య వాస్తవం

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను తలదన్నేలా, - మిగతా 2లో..



## పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి

**- సాయి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి.**
**- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు.**
**- తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు!**

హైదరాబాద్- సూర్య వాస్తవం

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి సాయి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదోపవాదాలను విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన - మిగతా 2లో..

## రేపు, ఎల్లుండి కడప జిల్లాలో పర్యటించనున్న జగన్

**- రేపు ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకోనున్న జగన్**
**- రేపు రాత్రికి పులివెందులలోనే బస**
**- ఎల్లుండి ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్**



2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### అంతర్జాతీయ ప్రమాణాలతో

# అభివృద్ధికి కార్యాచరణ

**- తెలంగాణ టూరిజంపై సీఎం రేవంత్ ఫోకస్..**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత విస్తరించి, ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక చర్యలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు కలిగిన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ పర్యాటకులకు ఆకర్షణీయ గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పర్యాటక రంగ అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని సీఎం నిర్వహించారు. సమావేశంలో సీఎం సలహాదారు రామ కృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, దుర్గం చెరువును దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే సమగ్ర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే తారామతి బారాదరిని మరింత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రముఖ ఆకర్షణగా మార్చాలని అధికారులను ఆదేశించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునిక హంగులతో పునర్నిర్మించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ వారసత్వాన్ని ప్రతిబింబించే పురానాపూల్ వంతెనను పర్యాటక అభివృద్ధితో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. అవసరమైతే వంతెనపై ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లించి, పర్యాటక కార్యకలాపాలకు అనుకూలంగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఇక 'టూరిజం హబ్ డెవలప్‌మెంట్' కార్యక్రమంలో భాగంగా వికారాబాద్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వికారాబాద్‌లోని ప్రసిద్ధ వీరభద్రస్వామి ఆలయాన్ని యాదాద్రి తరహాలో పీఠభూమి నమూనాతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.






## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

**- సీజేపీ ఉద్యమానికి వ్యకాస సంఘీభావం**
**- పదో రోజుకు వాంగ్‌చుక్ నిరాహార దీక్ష**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి రాష్ట్రపతి బర్తరఫ్ చేయాలని వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల జాతీయ వేదిక డిమాండ్ చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళన సోమవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. అదే విధంగా సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష పదో రోజుకు చేరుకుంది. - మిగతా 2లో..

# కిష్టవార్‌లో క్లౌడ్‌బరస్ట్

(మొదటిపేజీ తరువాయి)

రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. అదే సమయంలో దోడా జిల్లాలోని ప్రేమ్‌నగర్ ప్రాంతంలో కూడా భారీ వర్షాల ప్రభావంతో కొండచరియలు విరిగిపడటంతో రహదారి దెబ్బతింది. దీంతో పలుచోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఘటనపై అప్రమత్తమైన అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు, రహదారుల శాఖ సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరుకుని బురద, రాళ్ల తొలగింపు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రహదారులను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరం లేని ప్రయాణాలను నివారించా లని, కొండ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ కేసులో తీర్పును రిజర్వ్ చేశారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌పై కేసు నమోదు చేయగా, నిందితుడికి బెయిల్ మంజూరు చేయవద్దని పోలీసులు, బాధితురాలి తరఫు న్యాయవాదులు కోర్టులో గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేశారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో రాజకీయ పలుకుబడి ఉపయోగించి సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, ఇంకా కీలక సాక్షులను విచారించాల్సి ఉన్నందున బెయిల్ ఇస్తే వారు స్టేట్‌మెంట్లు ఇవ్వడానికి వెనకాడుతారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ పారదర్శకంగా సాగాలంటే నిందితుడు జైల్లోనే ఉండాలని వాదించారు. కాగా, ఇరుపక్షాల సుదీర్ఘ వాదనల అనంతరం హైకోర్టు తన నిర్ణయాన్ని వాయిదా వేస్తూ తీర్పును రిజర్వ్ చేసింది.

# రేపు, ఎల్లుండి కడప జిల్లాలో పర్యటించనున్న జగన్

**- రేపు ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకోనున్న జగన్ - రేపు రాత్రికి పులివెందులలోనే బస**

**- ఎల్లుండి ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్**

**అమరావతి - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రేపటి నుంచి రెండు రోజుల పాటు కడప జిల్లాలో పర్యటించనుఓన్నారు. పార్టీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... రేపు ఉదయం 11.30 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక ప్రజలు, నాయకులను కలుసుకుంటారు. అక్కడ 'ప్రజాదర్బార్' నిర్వహించి, ప్రజల నుంచి స్వయంగా వినతులు, సమస్యల అర్జీలను స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలోనే బస చేస్తారు. బుధవారం ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి 7.30 గంటలకు ఆయన ఇడుపులపాయకు చేరుకుంటారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని.. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ సంస్మరణ కార్యక్రమం ముగిసిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగుప్రయాణం అవుతారు.

# పేదలు, మైనారిటీల ఓటు హక్కును లాక్కోవడానికా ప్రతిపక్ష పార్టీల కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

మిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో మనం సహకరించినంతగా మరే రాష్ట్రం సహకరించలేదు. ఎస్ఐఆర్ విషయంపై కుమారస్వామి, ప్రహ్లాద్ జోషిలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు చేసిన ఫిర్యాదు గురించి అడగ్గా, ఆయన ఇలా అన్నారు, "ఎస్ఐఆర్ విషయంపై మాకు మా అభిప్రాయ భేదాలు ఉన్నాయి. మేము మా వాదనలను కోర్టులో విని పించాము కోర్టు ఈ విషయంపై తన తీర్పును ఇచ్చింది." "ఈ ప్రక్రియ షెడ్యూల్‌తో మేము అసంతృప్తిగా ఉన్నాముదీనికి వ్యతిరేకంగా కోర్టును కూడా ఆశ్రయిస్తాము. ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించడానికి మా ప్రభుత్వం ఎన్నికల సంఘంతో చేతులు కలిపింది. మా వలె మరే ఇతర రాష్ట్రం సహకరించ లేదు. మీ ఓటు హక్కే మీ జీవించే హక్కు అని చెప్పడం ద్వారా, ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకునేలా ప్రభుత్వం వారిలో అవగాహన కల్పిస్తోంది," అని ఆయన వివరించారు.

**ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లో అవగాహన కల్పించడానికి భయపడుతున్నాయి.**

"బిఎల్ఏ2లను నియమించుకోవడానికి అన్ని పార్టీలకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. కాంగ్రెస్, బీజేపీ, జనతా దళ్ పార్టీలు బిఎల్ఏలను నియమించాయి. సంస్థలు సహాయం అందించడానికి కూడా అనుమతి ఇచ్చారు. కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే అధికారులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించడం చూసి ప్రతిపక్ష పార్టీలు భయపడటం మొదలుపెట్టాయి. ఎన్నికల సంఘంపై తమకు నమ్మకం లేదని వారు వ్యక్తం చేస్తున్నారు. దానిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఎన్నికల సంఘానికే వదిలేయాల్సిన విషయం," అని ఆయన అన్నారు.

**వారు అధికారంలో ఉన్నప్పుడు అక్రమ వలసదారులను ఎందుకు బహిష్కరించలేదు?**

రాష్ట్రంలో సుమారు 4.50 కోట్ల మంది కుల ధృవీకరణ పత్రాలు తీసుకున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు మేము వీలు కల్పించాము. ఇప్పుడు, నివాస ధృవీకరణ పత్రాలు జారీ చేసే అధికారాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించడం జరిగింది. 2002 బ్యాలెట్ పేపర్ రికార్డు ఎవరి దగ్గరా లేదు. దానిని డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలు కల్పించడం జరిగింది. కర్ణాటక ప్రజల ఓటు హక్కును పరిరక్షించాలని ప్రభుత్వం పిలుపునిస్తోంది. వారు బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చినవారని ప్రతిపక్ష పార్టీలు అంటున్నాయి. మీరు అధికారంలో ఉన్నప్పుడు వారిని ఎందుకు తరిమివేయలేదు? అప్పుడు వారిని ఎవరు అడ్డుకున్నారు?" అని ఆయన ప్రశ్నించారు.

# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలు గోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు.

జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసు లను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించనున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.

# విశాఖలో 'బే సిటీ'..

(మొదటిపేజీ తరువాయి)

లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు.

**ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

**'వైజాగ్ బే సిటీ'.. పర్యాటక సర్క్యూట్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు-పాడేరు-విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని, సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**అమరావతి, తిరుపతి రీజియన్ల అభివృద్ధి**

రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ పది రోజుల్లో వాంగ్‌చుక్ బరువు దాదాపు ఏడు కిలోలు తగ్గిందని వైద్యులు తెలిపారు. దీక్షను అణచివేసేందుకు ఢిల్లీ పోలీసులు నిరంతరం పలు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం రాత్రి, జంతర్ మంతర్ వద్ద మహిళా నిరసనకారుల అనుమతి లేకుండా పోలీసులు ఫొటోలు తీయడంపై వివాదం చెలరేగింది. దీనిపై సీజేపీ కార్యకర్తలు ప్రశ్నించగా డీసీపీ ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నామని పోలీసులు వివరించారు. మరోవైపు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీ నగర్‌లో నిర్వహించిన ఆందోళనలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పాల్గొన్నారు. విద్యార్థులు, యువకులు భారీగా ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

**వ్యకాస సంఘీభావం**

జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేస్తున్న ఆందోళనకు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మికు జాతీయ ఐక్య వేదిక సంఘీభావం తెలిపింది. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఎడబ్ల్యుయూ) ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, బీకేఎంయూ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, జాతీయ వేదిక నాయకులు సాహిల్ బహదూర్ శిబిరంలో నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్, విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న నిరవధిక నిరాహార దీక్ష దేశ విద్యా వ్యవస్థను కాపాడడం కోసం, భావితరాల భవిష్యత్తును రక్షించడం కోసం జరుగుతున్న ఒక చారిత్రక దీక్ష అని పేర్కొన్నారు. విద్యను రక్షించడం అంటే దేశ భవిష్యత్తును రక్షించడమేనని అన్నారు. ఈ ఉద్యమానికి దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, మేధావులు, ప్రజాస్వామ్య శక్తుల మద్దతు క్రమంగా పెరుగుతోందని తెలిపారు. దేశాన్ని కుదిపేసిన నీట్ ప్రశ్నాపత్రాల లీక్ కేవలం కొందరు వ్యక్తుల నేరం కాదని, మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కేంద్రీకృత, కార్పొరేట్ అనుకూల విద్యా విధానాల ప్రత్యక్ష ఫలితమేనని విమర్శించారు. ఈ కుంభకోణానికి పూర్తి నైతిక, రాజకీయ బాధ్యత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌దేనని పేర్కొంటూ, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ భావితరాల భవిష్యత్తును కాపాడేందుకు జరుగుతున్న ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని, విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణకు బ్రేక్...

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మోదీ తన టీమ్‌ను పూర్తిస్థాయిలో మార్చేస్తారని, పనితీరు సరిగ్గా లేని మంత్రులను తొలగించి కొత్త ముఖాలకు, ముఖ్యంగా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేస్తారని అనుకున్నారు. అయితే, శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వర్షాకాల సమావేశాల అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో.. ఢిల్లీ పొలిటికల్ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్లమెంట్ వేదికగా అత్యంత కీలకమైన సెషన్ నడవబోతున్న తరుణంలో.. ఈ లోపు క్యాబినెట్ విస్తరణ చేపట్టే సాహసం ప్రధాని మోదీ చేయడం లేదని, ఈ మార్పు చేర్పుల ప్రక్రియను ఆయన వ్యూహాత్మకంగా వాయిదా వేశారని క్లారిటీ వచ్చిందికేంద్ర కేబినెట్ మార్పుచేర్పుల వాయిదా వెనుక ఒక పక్కా పొలిటికల్ టైమింగ్ దాగి ఉందని తెలుస్తోంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న సమావేశాల ముందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోంది. ముఖ్యంగా పీఎం, సీఎంల ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ జూలై 17న తన నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లుపై కూడా ఉభయ సభల్లో వాడివేడి చర్చలు జరగనున్నాయి. ఇలాంటి అత్యంత సంక్లిష్టమైన చట్టాలు పాస్ కావాల్సిన సమయంలో క్యాబినెట్‌ను కదిలిస్తే.. ప్రయారిటీ మారి పోతుందని అనుకుంటున్నారు.పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత, ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ మెగా క్యాబినెట్ విస్తరణ , బిజెపి సంస్థాగత మార్పులు ఏకకాలంలో జరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా క్యాబినెట్ విస్తరణపై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాల్సిన అవసరాన్ని ప్రధానికి గుర్తుచేశాయి జూన్ చివరి వారంలో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవ్వడం, ఆ తర్వాత వివిధ శాఖల కార్యదర్శులతో వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘ సమీక్షలు నిర్వహించడం వెనుక.. ఏ ఏ మంత్రుల పనితీరు ఎలా ఉందో స్వయంగా నివేదికలు తెప్పించుకోవడానికేనని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వ మనుగడ, రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను బ్యాలెన్స్ చేయాల్సి ఉన్నందున.. తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం కంటే, పూర్తి స్థాయి నివేదికలతో సెప్టెంబర్‌లో రంగంలోకి దిగడమే ఉత్తమమని ప్రధాని డిసైడ్ అయ్యారు.ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రివర్గ మార్పులపై వెనక్కి తగ్గలేదు, కేవలం సమయాన్ని మాత్రమే మార్చారు. వర్షాకాల సమావేశాల రూపంలో విపక్షాల నుండి రాబోయే పొలిటికల్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, తమకు కావలసిన కీలక బిల్లులను పార్లమెంట్‌లో గట్టెక్కించుకోవడమే ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఆ తర్వాతే.. సెప్టెంబర్ వేదికగా 'టీం మోదీ' లోకి సరికొత్త భారీ మార్పులు, భారీ చేర్పులు ఉండబోతున్నాయనేది ఢిల్లీ వర్గాల అంచనా.

## సంపాదకీయం

# ముప్పేట దాడిలో పాకిస్తాన్




పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం ఇప్పుడు కొత్త రూపం తీసుకుంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పాకిస్తాన్ భద్రతా దళాలను మాత్రమే కాకుండా, చైనా ప్రయోజనాలను కూడా నేరుగా లక్ష్యంగా చేసుకుంటోంది. ఇటీవలి దాడులు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. చైనా?పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుల భద్రతపై ఇది తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.గ్వాదర్ పోర్టు సమీపంలోని జివానీ ప్రాంతంలో జరిగిన ఇటీవలి ఘటనలో బీఎల్ఏ పాకిస్తాన్ సైన్యానికి చెందిన రాడార్ స్టేషన్, ఎయిర్ స్టేషన్ ఔట్‌పోస్టుపై దాడి చేసింది. ఈ ప్రాంతానికి సమీపంలో చైనాకు సంబంధించిన స్థావరం ఉండటం వల్ల ఈ దాడి చైనాపై కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గ్వాదర్ పోర్టుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ దాడి, హార్మూజ్ జలసంధికి సమీపంలో ఉండటం వల్ల వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. బీఎల్ఏ మందుగుండు వాహనంతో ఆత్మాహుతి దాడి చేసినట్లు సమాచారం. దీంతో పాకిస్తాన్ భద్రతా దళాల్లో భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు బీఎల్ఏ నాలుగైదు ప్రధాన వంతెనలను పేల్చివేసి, ఇప్పుడు తీర భద్రతా దళాలపై కూడా దాడులు చేస్తోంది. బీఎల్ఏ తన స్వంత నేవీ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటనలు వచ్చాయి. గతంలో కోస్ట్ గార్డ్ సిబ్బందిపై దాడులు జరిపి, ముగ్గురిని చంపినట్లు బీఎల్ఏ పేర్కొంది.చైనా ఇప్పటికే పాకిస్తాన్ భద్రతా ఏర్పాట్లపై నమ్మకం కోల్పోయి, తన స్వంత రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు చైనా పెట్టుబడుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా?పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో కీలక భాగం. గ్వాదర్ పోర్టు ద్వారా చైనాకు అరేబియన్ సముద్రంలో ప్రత్యక్ష ప్రవేశం లభిస్తుంది. ఈ ప్రాంతంలో దాడులు పెరగడం వల్ల ప్రాజెక్టుల అమలు ఆలస్యం కావడం, ఖర్చులు పెరగడం, పెట్టుబడిదారుల నమ్మకం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. బీఎల్ఏ దాడులు ఇప్పుడు చైనా నియంత్రణలో ఉన్నట్లు భావించే ప్రాంతాల్లోకి విస్తరించాయి. ఇది చైనా ప్రణాళికలను భంగపరచడమే కాకుండా, పాకిస్తాన్‌తో చైనా సంబంధాలను కూడా పరీక్షిస్తోంది. చైనా ఇప్పటికే ఉలిక్కిపడి, భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసుకుంటోంది.బీఎల్ఏ దాడులు ఇప్పుడు మరింత సంఘటితంగా, వ్యూహాత్మకంగా మారాయి. గ్వాదర్ పోర్టును తదుపరి టార్గెట్‌గా ఎంచుకోవచ్చని చర్చలు జరుగుతున్నాయి. బీఎల్ఏ తన దాడుల వీడియోలు, సాక్షాలతో సహా విడుదల చేస్తోంది. దీని వల్ల ప్రచారం విస్తృతంగా వ్యాపిస్తోంది. అయితే పాకిస్తాన్ అధికారులు ఈ ఘటనల గురించి బహిరంగంగా మాట్లాడడం లేదు. పత్రికల్లో కూడా విస్తృతంగా కవరేజ్ రావడం లేదు. ఇది ప్రభుత్వం దాడుల పరిమాణాన్ని తక్కువ చేయడానికి లేదా చైనా పెట్టుబడులపై నమ్మకం కల్పించడానికి చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, బీఎల్ఏ ప్రచారం వల్ల వాస్తవాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్నాయి.ఈ దాడుల నేపథ్యంలో అమెరికా బలూచ్ ఉద్యమానికి మద్దతు ఇస్తోందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది చైనా ప్రభావాన్ని అడ్డుకోవడానికి భాగంగా ఉండవచ్చని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవి ఇప్పటికి అనుమానాలే. చైనా బలూచిస్తాన్ నుంచి వెళ్లిపోవాలనే ఉద్దేశంతో బీఎల్ఏ ఈ దాడులు చేస్తోందని కూడా భావన ఉంది. గ్వాదర్ పోర్టు, సమీప ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు కొనసాగితే, చైనా తన ప్రాజెక్టులను పునఃసమీక్షించవచ్చు లేదా భద్రతా ఖర్చులను బాగా పెంచవచ్చు.బలూచిస్తాన్ సమస్య ఇప్పుడు స్థానిక స్థాయిని దాటి ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను కలిగిస్తోంది. చైనా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, భద్రతా సవాళ్లు రెండు దేశాలను కూడా ఒత్తిడిలోకి తెస్తున్నాయి.జైష్ ఎ మహ్మద్‌కు కేటాయించిన భూమి సుమారు 5 ఎకరాలు. ఒక ఎకరం సుమారు 4,800 గజాలకు సమానం కాబట్టి మొత్తం స్థలం 24,000 గజాలు అవుతుంది. సాధారణంగా ఒక వ్యక్తిని సమాధి చేయడానికి 6 గజాలు సరిపోతాయని పరిగణిస్తే, ఈ భూమిలో సుమారు 4 వేల మంది వరకు సమాధి చేయవచ్చు. ఇంత పెద్ద ప్రాంతాన్ని కేటాయించడం సాధారణం కాదు. ఇది భవిష్యత్తులో ఎక్కువ సంఖ్యలో మరణాలను ఊహించి లేదా ఇప్పటికే జరిగిన పెద్ద నష్టాలను సూచిస్తోంది.ఈ సమాధి స్థలాలు ఆపరేషన్ సిందూర్ అనే సైనిక చర్యతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం లష్కర్ ఎ తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్, జైష్ ఎ మహ్మద్‌తోపాటు మరో రెండు ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 11 స్థావరాలపై దాడి చేసింది. బ్రహ్మోస్ క్షిపణులు ఉపయోగించి ఈ దాడులు నిర్వహించారు. నివేదికల ప్రకారం వందల మంది ఉగ్రవాదులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఉమర్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే బతికి ఉన్నట్లు సమాచారం.ఈ వైరల్ ఫొటోలు, స్థల కేటాయింపులను పరిశీలిస్తే ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద సంస్థలపై ఎంత బలమైన దెబ్బ తగిలించిందో అర్థమవుతుంది. ఒక్క జైష్ ఎ మహ్మద్‌కే 5 ఎకరాలు కేటాయించడం, మిగతా సంస్థలకు ప్రత్యేక స్థలాలు ఇవ్వడం. ఇవి అన్నీ ఒకేసారి జరిగిన పెద్ద మరణాలను సూచిస్తున్నాయి. 4 వేల మంది వరకు సమాధి చేయగల స్థలం కేటాయించడం అంటే ఆ సంస్థలు తమ సభ్యులను కోల్పోయిన స్థాయి చాలా ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. బ్రహ్మోస్ వంటి అధునాతన క్షిపణులతో ఏకకాలంలో బహుళ స్థావరాలపై దాడి చేయడం భారత సైన్యం యొక్క ఖచ్చితత్వం, సామర్థ్యం, ఉగ్రవాద వ్యతిరేక నిబద్ధతను చూపిస్తోంది. ఒక్క ఉమర్ మాత్రమే బతికి ఉండటం మిగతా వారందరూ ఆ దాడిలో చనిపోయినట్లు స్పష్టం చేస్తోంది. ఇది పాకిస్తాన్ భూభాగం నుంచి నడిచే ఉగ్రవాద కార్యకలాపాలకు తీవ్రమైన ఎదురుదెబ్బగా మారింది.అవి ఆపరేషన్ సిందూర్ విజయం, ఉగ్రవాద సంస్థలకు కలిగిన భారీ నష్టానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇలాంటి చర్యలు సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో భారత్ తీసుకుంటున్న చర్యల ప్రభావాన్ని మరింత స్పష్టంగా చూపుతాయి.బీఎల్ఏ దాడులు ఇలాగే కొనసాగితే, సీపీఈసీ ప్రాజెక్టుల వేగం మందగించడం, ప్రాంతీయ అస్థిరత పెరగడం తప్పదు. ఈ పరిస్థితి బలూచిస్తాన్‌లోని స్థానిక గుర్తింపు, వనరుల పంపిణీ సమస్యలను పరిష్కరించకపోతే, మరింత తీవ్రమవుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# అమరావతి పేరు మార్పు సాధ్యమా

**విజయవాడ – సూర్య వాస్తవం**




ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు వ్యవహారంలో జగన్ రెడ్డి వ్యూహాలు రోజుకో కొత్త రూపం దాలుస్తున్నాయి. రాజకీయంగా నినాదాలు ఇవ్వడం సులువే కానీ, వాటికి చట్టబద్ధత కల్పించడం వేరు. అధికారంలోకి వస్తే కేవలం ఒక జీవో ద్వారా లేదా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాల ద్వారా రాజధాని లేదా రాజధాని పేరు మార్చలేరు. ఎందుకంటే పార్లమెంట్‌లో ఉభయ సభల ఆమోదంతో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం' ను తీసుకువచ్చింది. ఈ చట్టంలో స్పష్టంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నగరం పేరు 'అమరావతి' అని లిఖితపూర్వకంగా పొందుపరిచారు. భారత రాజ్యాంగం ప్రకారం ఒకసారి పార్లమెంట్ చట్టం చేసిన తర్వాత, దాని పరిధిలోని అంశాలను మార్చే అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, ముఖ్యమంత్రికి గానీ ఉండదు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 254 ప్రకారం కేంద్ర చట్టానికి, రాష్ట్ర ప్రభుత్వ చట్టానికి లేదా ఆలోచనకు మధ్య ఘర్షణ వస్తే.. కేంద్రం చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది. కాబట్టి జగన్ అసెంబ్లీలో మావిగన్ అని తీర్మానం చేసినా, అది పార్లమెంట్ చట్టం ముందు చెల్లకుండా పోతుంది. ఒకవేళ భవిష్యత్తులో జగన్ ముఖ్యమంత్రి అయ్యి, అమరావతి పేరును మార్చాలని పట్టుబడితే.. ఆయన ముందున్న ఏకైక మార్గం ఢిల్లీలోని పార్లమెంట్‌లో మళ్లీ సవరణ బిల్లు పెట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడం.ప్రస్తుత , రాబోయే జాతీయ రాజకీయ సమీకరణాల్లో ఏ కేంద్ర ప్రభుత్వమైనా ఏపీ రాజధాని పేరును మార్చడానికి పార్లమెంట్‌లో మళ్లీ బిల్లు పెట్టే సాహసం అస్సలు చేయదు. ఎందుకంటే అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతం పేరు కాదు.. అది అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ సొంతం చేసుకున్న నగరం. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థలు అమరావతి అనే నిర్దిష్ట పేరుతోనే వేల కోట్ల రూపాయల రుణాల ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇప్పుడు పేరు మారిస్తే ఆ గ్లోబల్ ఒప్పందాలన్నీ లీగల్ చిక్కుల్లో పడతాయి.ఇక మరో ముఖ్యమైన అడ్డంకి.. సుప్రీంకోర్టు , హైకోర్టుల తీర్పులు. అమరావతి ల్యాండ్ పూలింగ్ ఒప్పందాలలో రాజధాని నగరం అమరావతి అభివృద్ధి అనేది ఒక ముఖ్యమైన లీగల్ క్లాజ్. పేరు మార్పు అనేది కేవలం అక్షరాల మార్పు కాదు, అది ఒక చట్టబద్ధమైన అస్తిత్వాన్ని మార్చడమే అవుతుంది. పేరు మార్చడం ద్వారా ల్యాండ్ పూలింగ్ ఒప్పందాల ఉద్దేశాన్ని నీరుగార్చాలని చూస్తే.. భూములిచ్చిన 29,000 మంది రైతులు కోర్టును ఆశ్రయించవచ్చు. గతంలో మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన ప్రయోగాలను కోర్టులు ఎలా నిలిపివేశాయో అందరికీ తెలుసు. మావిగన్ జగన్ తన లాంటి వాళ్లను మభ్యపెట్టడానికి పనికొచ్చే ఒక పొలిటికల్ స్టంట్ మాత్రమే తప్ప.. పార్లమెంట్ చట్టం అనే గట్టి లీగల్ గోడను దాటి అమరావతి పేరును కూడా మార్చడం జగన్ తరం కాదు.

### ట్రంక్ ఇన్‌ఫ్రాకు అడ్డం పడే భూముల సేకరణ

రాజధాని అమరావతిలో ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల నిర్మాణానికి ఎదురవుతున్న భూ సమస్యల అడ్డంకులను అధిగమించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు భూసమీకరణ విధానంలో తమ స్థలాలను ఇవ్వడానికి నిరాకరిస్తూ మొండిగా వ్యవహరిస్తున్న కొంతమంది నుంచి చట్టపరమైన భూసేకరణ ప్రక్రియ ద్వారా భూములను స్వాధీనం చేసుకోవడానికి సర్కార్ సర్వం సిద్ధం చేసింది. నిర్దిష్ట భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించనున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ వివాదంలో ఇప్పటికే కొంతమంది రైతులు పరిస్థితులను అర్థం చేసుకుని తమ భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారు. అయితే, మిగిలిన కొద్దిమంది మాత్రం తమ భూములు ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత కీలకం కావడాన్ని ఆసరాగా చేసుకుని, మార్కెట్ ధర కంటే అత్యధిక పరిహారం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం అత్యంత స్పష్టమైన లైన్ తీసుకుంది. రాజధాని కోసం భూములిచ్చిన ఇతర రైతులకు ఏ రకమైన ప్యాకేజీ ఇచ్చామో, అదే నిబంధనలు వీరికీ వర్తిస్తాయని, అంతకుమించి ఒక్క రూపాయి కూడా అదనంగా ఇచ్చేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది.ఈ క్రమంలో భూసమీకరణ, భూసేకరణల మధ్య ఉన్న వ్యత్యాసాలను అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ రైతులు మొండితనం వీడి భూసమీకరణ కు అంగీకరిస్తే.. వారికి చట్టప్రకారం వచ్చే ఏటా కౌలుతో పాటు, రుణమాఫీ, భవిష్యత్తులో కోట్లాది రూపాయల విలువైన పూలింగ్ ప్లాట్స్ దక్కుతాయి. కానీ, ప్రభుత్వం చట్టపరంగా 'భూసేకరణ'కు వెళ్తే మాత్రం.. కేవలం 2013 భూసేకరణ చట్టం ప్రకారం లెక్కగట్టి వన్-టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బులు మాత్రమే చేతిలో పెడతారు. ఆ తర్వాత వారికి ఎలాంటి పూలింగ్ ప్లాట్స్ గానీ, రాజధాని అభివృద్ధి లబ్ధి గానీ దక్కే అవకాశం ఉండదు.ఇప్పటికీ పట్టుదలకు పోయి నిబంధనలకు అడ్డుపడుతున్న వారిపై సోమవారం నుండి ప్రభుత్వం నిర్బంధ భూసేకరణ అస్త్రాన్ని ప్రయోగించబోతోంది. దీనికి సంబంధించిన లీగల్ నోటిఫికేషన్లు, పరిహారం అవార్డుల ప్రకటన , బాధితుల ఖాతాల్లో నిధులు జమ చేసే ప్రక్రియతో సహా అన్ని రకాల సాంకేతిక, పరిపాలనాపరమైన ఏర్పాట్లను సీఆర్‌డీఏ , రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. దీంతో ట్రంక్ ఇన్‌ఫ్రా రోడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ఉన్న చివరి అడ్డంకి కూడా తొలగిపోనుంది.

# జోసఫ్ రావణ్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు

**ఏలూరు – సూర్య వాస్తవం**




ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అడ్డగోలు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో యూట్యూబర్ బచలకురి జోసఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను జూలై 1, 2026 న హైదరాబాద్‌లో ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి పలు కేసుల్లో అరెస్టవుతూనే ఉన్నారు. ఆయన అరెస్ట్‌ను కొందరు ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తున్నారు.. ప్రజాస్వామ్యానికి విఘాతం అంటూ కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఈ ప్రశ్న అనే పేరు పెట్టుకున్న మేధావి ఏం ప్రశ్నించారో ఎవరైనా చెప్పగలరా?అసలు ఈ జోసఫ్ రావణ్ అనే వ్యక్తి తన యూట్యూబ్ ఛానల్‌లో ఏపీ ప్రభుత్వ విధానాలపై ఏమైనా ప్రశ్నించాడా? పవన్ కల్యాణ్ పరిధిలోని పంచాయతీ రాజ్ లేదా అటవీ శాఖల్లోని లోపాలపై సమాచార హక్కు చట్టం ద్వారా నిలదీశాడా? లేక ప్రజాస్వామ్యయుతంగా ప్రజలకు తెలియాల్సిన అంశాలపై చర్చలు జరిపాడా? అని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే షాకింగ్ నిజాలు బయటపడుతున్నాయి. ఈ 'ప్రశ్న రావణ్' ఛానల్ మొత్తం వెతికినా ఎక్కడా ప్రజలకు ఉపయోగపడే ఒక్కటంటే ఒక్క విమర్శనాత్మక ప్రశ్న కూడా కనిపించదు. అన్నీ అయితే దైవదూషణలు..లేకపోతే పవన్ కల్యాణ్‌పై నిందలు. చివరికి టెర్రరిస్టుల్ని కూడా సమర్థించే బాపతు.జూన్ 28న ఏలూరులో జరిగిన ఒక సభలో ఈయన చేసిన వ్యాఖ్యలే ఈ వరుస అరెస్టులకు కారణమయ్యాయి. అక్కడ ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య పరిధిని దాటిపోయాయి. ఆయన మాట్లాడిన భాష, వాడిన పదజాలం ఏమాత్రం నాగరిక సమాజం ఆమోదించేలా లేవని సగటు నెటిజన్లు స్క్రీన్‌షాట్లతో సహా ఎండగడుతున్నారు. కేవలం పొలిటికల్ మైలేజ్ కోసం, వ్యూస్ కోసం పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని, ఆయన సతీమణిని టార్గెట్ చేస్తూ అత్యంత అసభ్యకరంగా థంబ్‌నైల్స్ పెట్టడం, లైవ్‌లలో బూతులు తిట్టడమే ఈయన నిత్యకృత్యంగా మారిందని రికార్డులు చెబుతున్నాయి.జోసఫ్ రావణ్ కేవలం రాజకీయ నాయకులను మాత్రమే కాదు.. సనాతన ధర్మాన్ని, హిందూ దేవుళ్లను టార్గెట్ చేస్తూ అత్యంత దారుణమైన రీతిలో దైవదూషణలకు పాల్పడిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. మతాల మధ్య చిచ్చు పెట్టేలా, ఒక వర్గాన్ని కించపరుస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై గతంలోనూ కేసులు నమోదయ్యాయి. సలు ఎలాంటి నైతికత లేని ఇటువంటి సోషల్ మీడియా అబ్యూజర్‌ను సమర్థిస్తూ.. కొందరు దీనిని ప్రజల గొంతుకను నొక్కేయడం అని అభివర్ణించడం ఘోరమైన విషయం. ప్రశ్న అనే పవిత్రమైన పదానికి ముసుగు వేసి.. మత దూషణలు, బూతుల పురాణం అందుకునే వాళ్లను అరెస్ట్ చేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడదు.. పైగా మరింత స్వచ్ఛంగా మారుతుంది.

### ఉపా కేసు

యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ ను గన్నవరం పోలీసులు సాధారణ సోషల్ మీడియా కేసుల్లో అరెస్టు చేయలేదు. ఆయనపై గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఉపా చట్టం కింద కేసు నమోదైంది. ఈ అఫీషియల్ అరెస్ట్ నోటీసు ప్రకారం.. ఉపా చట్టంలోని సెక్షన్ 13 , సెక్షన్ 39 ప్రకారం ఉగ్రవాద సంస్థలకు మద్దతునిచ్చిన కారణంగా ఈ కేసులు పెట్టారు. అత్యంత కఠినమైన దేశద్రోహ ముద్ర కలిగిన సెక్షన్లను చేర్చారు. వీటితో పాటు భారతీయ న్యాయ సంహిత లోని పలు తీవ్రమైన సెక్షన్ల కింద నక్కపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు ఈ అధికారిక అరెస్ట్ ప్రక్రియను పూర్తి చేశారు.సాధారణ క్రిమినల్ చట్టాలతో పోలిస్తే ఉపా చట్టం చాలా భిన్నమైనది, అత్యంత పవర్‌ఫుల్ అయినది. సాధారణ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన 24 గంటల లోపు తప్పనిసరిగా స్థానిక మేజిస్ట్రేట్ లేదా కోర్టు ముందు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కానీ, ఉపా చట్టం కింద నిర్బంధించినప్పుడు పోలీసులకు లీగల్ గా అదనపు సమయం , కొన్ని మినహాయింపులు లభిస్తాయి. ఉపా సెక్షన్ల కింద నిందితుడిని కోర్టు అనుమతితో గరిష్ఠంగా 30 రోజుల వరకు పోలీస్ కస్టడీకి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. అలాగే, సాధారణ కేసుల్లో 60 నుండి 90 రోజుల్లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాల్సి ఉండగా.. ఉపా కేసుల్లో దర్యాప్తు సంస్థలకు కోర్టు అనుమతితో 180 రోజుల వరకు చార్జ్‌షీట్ దాఖలు చేసే గడువు లభిస్తుంది.ఈ చట్టం కింద ఒకసారి కేసు నమోదైతే నిందితుడికి అంత సులభంగా బెయిల్ లభించదు. ఉపా చట్టంలోని సెక్షన్ 43ఆ(5) ప్రకారం.. నిందితుడిపై మోపిన ఆరోపణలు ప్రాథమికంగా నిజమే అని కోర్టు భావిస్తే, సదరు నిందితుడికి బెయిల్ నిరాకరించే సంపూర్ణ హక్కు న్యాయస్థానాలకు ఉంటుంది. సాధారణ కేసుల్లో బెయిల్ అనేది ఒక హక్కు, జైలు అనేది మినహాయింపు అనే సూత్రం వర్తిస్తుంది కానీ, ఉపా చట్టం కిందకు వచ్చేసరికి ఆ నిబంధన తలకిందులవుతుంది. అందువల్లనే, ఈ కేసులో నిందితుడి తరఫున వాదించే లాయర్లకు కూడా కోర్టుల్లో తక్షణ ఉపశమనం లేదా బెయిల్ తీసుకురావడం చట్టపరంగా ఒక పెద్ద సవాలుగా మారుతుంది.కూటమి ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాలలో వాక్స్వాతంత్రం హద్దులు దాటి దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించేలా వీడియోలు పోస్ట్ చేశారనే ఆరోపణలు ప్రశ్న రావణ్‌పై ఉన్నాయి. ఉగ్రవాదుల్ని సమర్థిస్తూ ఆయన వీడియోలు చేశారు. దేశద్రోహ శక్తుల నుండి, బయటి వ్యక్తుల నుండి అందుతున్న ఫండింగ్ తోనే వ్యవస్థలను బద్నాం చేయడానికి ఇటువంటి కుట్రలు పన్నారనే కోణంలో గన్నవరం పోలీసులు లోతైన దర్యాప్తు ప్రారంభించారు. గత నాలుగు రోజుల్లో వరుసగా ఐదు కేసుల్లో బెయిల్ పొందినప్పటికీ.. ఇప్పుడు ఉపా లాంటి దేశ రక్షణ చట్టం తెరపైకి రావడంతో ఆయన ఇప్పుడల్లా బయటకు రావడం కష్టంగా మారనుంది

## తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**- పిఏబిఆర్ ఇన్టేక్ వెల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి పయ్యావుల కేశవ్**

**-అధికారులపై మంత్రి ఆగ్రహం**



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. పిఏబిఆర్ డ్యామ్‌లోని శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట్ ద్వారా ఉరవకొండకు తాగు నీటిని సరఫరా చేసే ఇన్టేక్ వెల్‌ను మంత్రివర్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ మంత్రి**

ప్రస్తుతం ఎల్-నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో, డ్యామ్‌లో తగినంత నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఉరవకొండకు తాగునీటి సరఫరా సక్రమం గా జరగకపోవడం అత్యంత బాధ్యతా రాహిత్యమని మంత్రివర్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓ అండ్ ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ఆయన ఘాటుగా స్పందించారు.

**జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో సంభాషణ -- విచారణకు ఆదేశం**

ఈ విషయమై మంత్రి పయ్యావుల కేశవ్ వెంటనే జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో ఫోన్లో మాట్లాడారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసు కోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. "తాగు నీటి విషయంలో ఎలాంటి అలసత్వాన్నీ ప్రభుత్వం సహించదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు.

## బూత్ స్థాయిలో ఓటరు జాబితా ప్రత్యేకంగా పరిశీలించిన ఎమ్మార్వో, ఎంపీడీఓ



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** పట్టణ పరిధిలోని 124వ పోలింగ్ బూత్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం చురుగ్గా సాగింది. ఓటరు జాబితా పారదర్శకత, సవరణలే లక్ష్యంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్నారు.

**ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల వెరిఫికేషన్**

ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్ రమేష్, బూత్ లెవెల్ ఆఫీసర్ మంజునాథ్ కలిసి బూత్ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీ**

సాగుతున్న ఈ ప్రత్యేక పరిశీలన ప్రక్రియను ఉరవకొండ ఎమ్మార్వో అరుణ, ఎంపీడీఓ బి.వి. రవి ప్రసాద్ స్వయంగా పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులూ దొర్లకుండా పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఓటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ వివరాలను సరిచూసుకున్నారు.

## ఇటుకలపల్లి ఎస్ఐగా విజయ్ కుమార్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఇటుకలపల్లి (ఎస్.కె.యూ) ఎస్.ఐగా విజయకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ జగదీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటుకలపల్లి ఎస్.ఐగా విజయకుమార్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్త చెరువుకు చెందిన ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా శ్రీశైలం, కొలిమిగుండ్ల, అనంతపురం జిల్లా శింగనమలలో ఎస్.ఐగా విధులు నిర్వహించారు. అంతకు ముందు అనంతపురం జీఆర్పీ ఎస్.ఐగా కూడా సమర్థవం తంగా సేవలు అందించారు. ఆయనకు ఇటుకలపల్లి పోలీసులు స్వాగతం పలికారు.

# ఎస్ఐఆర్ కాలవ్యవధి పెంచండి

**- రాష్ట్ర ముతువల్లిల సంఘం అధ్యక్షులు షకీల్ షఫీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మౌలానా నవాజ్ సాహెబ్**

**- కలెక్టర్ ఓ ఆనంద్ ను కలిసిన మైనార్టీ నాయకులు**

**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం**

అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్...రాష్ట్ర ముతువల్లిల సంఘం అధ్యక్షులు షకిల్ షఫీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మౌలానా నవాజ్ సాహెబ్, మైనార్టీ నాయకులు ఆధ్వర్యంలో అనంతపురం నియోజకవర్గంలోని మసీదుల ఇమాములు, మౌజెన్లు ముతువల్లీలు తో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి, ఓటరు పడుతున్న ఇబ్బందుల గురించి క్లుప్తంగా వివరణ ఇచ్చారు. 2002 ఓటర్ లిస్టులో పేరు లేకున్నా కూడా ఓటర్ నమోదు కార్యక్రమం ఫారం ఇవ్వడానికి ముందుకు రావాలని తెలిపారు. బి ఎల్ ఓ ఓటరు ఫారం నమోదు కొరకు ఓటర్ కు ఇచ్చినప్పుడు నమోదు కొరకు తిరిగి తీసుకున్నప్పుడు కూడా అక్నాలెడ్జ్మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ వివరించారు. బిఎల్ఓ లు ఇచ్చిన ఫారాలు వెంటనే బిఎల్ఓ కు తమ పూర్తి వివరాలతో తిరిగి ఇవ్వాల్సిన అవసరమెంతైనా ఉంది అని తెలిపారు. సార్ నమోదు కాల వ్యవధి పెంపు ఉండదని స్పష్టంగా తెలిపారు. ఒకవేళ బిఎల్వోలు ఫోనులో అందు బాటులో రాకుంటే యాప్ ద్వారా బుక్ ఎ కాల్ ఆప్షన్ను ఎంచుకోవాలని తద్వారా జిల్లా కలెక్టర్ నేరుగా సోమవారం నాడు ఎన్ని కాల్స్ వచ్చాయి ఎన్ని కాల్స్ తిరిగి బిఎల్వోలు సమాధానం ఇచ్చారు అనే డేటాను బట్టి ఆయన పర్యవేక్షణలో ఓటర్కు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. ఏ ఆధారాలు లేని వారు కూడా సెల్ఫ్ డిక్లరేషన్ ఫారం ద్వారా ఓటు నమోదు చేయాలని బిఎల్ఓ కు ఫారం ఇచ్చి అక్నాలెడ్జ్మెంట్ తీసుకోవాలని తీసుకోవాలని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం కూడా చేయాలని బిఎల్ఓ కు ఆదేశాలు జారీ చేశామని కాకపోతే 2002 నాటి డేటా పని ఒత్తిడి వల్ల కొన్నిచోట్ల కొత్త ఓటర్ కార్యక్రమ నమోదు తర్వాత చేస్తామని చెప్పడం జరుగుతోందని తెలిపారు. అనంతపురం పట్టణంలో అన్ని మసీదులలో ఎస్ ఐ ఆర్ నమోదు కార్యక్రమం చేపట్టినందుకు మంచి స్పందన ఉందని లకి ఇమాములకు, స్వచ్ఛంద సంస్థలకు కొనియాడారు. అనంతపురం జిల్లాలో చురుకుగా జిల్లా కలెక్టర్ శ్రీ ఆనంద్ ఆధ్వర్యంలో ఆయన పర్యవేక్షణలో ఆర్డీవోలు ,డిఆర్ఓలు, ఎమ్మార్వోలు, బిఎల్వోలు సాధ్యమైనంత ఎక్కువ శాతం ఎస్ ఐ ఆర్ నమోదు చేపడుతున్న తీరును మతపెద్దలు, ఇమాములు, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు డాన్ సాదిక్, తదితర నాయకులు పాల్గొన్నారు





# ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, నాయక్ నగర్, రాంనగర్ ప్రాంతాలలోని ఆయా పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పాల్గొని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత హౌసింగ్ బోర్డ్ లో పలు ఇళ్లను సందర్శించి ఓటర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ అర్హతను నిరూపించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ఓటరు జాబితాలో పేరు కొనసాగింపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ ఫారం అందని వారు, అలాగే ఫారం అందినా ఇంకా పూరించి బిఎల్ఓలకు సమ ర్పించని వారు ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏవైనా సందేహాలు ఉన్న వారు వెంటనే తమ బిఎల్ఓలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో అర్హత కలిగి ఉన్న పౌరుల ఓటు జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత ఆయా బిఎల్ఓలపై ఉందని, సర్ ప్రక్రియ పారదర్శ కంగా నిర్వహించినప్పుడే అర్హత కలిగిన పౌరుల ఓట్లు జాబితా నుంచి పోకుండా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని కుటుంబంలో ఓటర్ల వివరాలు ఒకే చోట నమోదు చేసే ఫ్యామిలీ మ్యాపింగ్ అత్యంత కీలకమని, ఓటర్లకు మరింతగా అవగాహన కల్పించి వారు ఓటు హక్కును నిలుపుకునే విధంగా డిజిటలైజేషన్ నమోదులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో తమ వంతు బాధ్యతగా రాజకీయ పార్టీలు తమ బిఎల్ఏల ద్వారా మరింత చురుకైన సహకారం అందించాలని కోరారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు కొత్త ఓట్ల నమోదు మార్పుల కొరకు ఎనుమరేషన్ ఫారాల సేకరణ తదితర అంశాలపై ఆయా బిఎల్ఓలు, బిఎల్ఏలు మరియు ఓటర్లతో జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఉదయం 6 గంటలకు ఉండాలని, ఎక్కువ పోలింగ్ స్టేషన్లపరిధిలో తక్కువ ఓటర్లు ఉన్నారని, తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి తీసుకోవడానికి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈనెల 14వ తేదీలోపు ఈ ప్రక్రియ ఖచ్చితంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



అంతకుముందు హౌసింగ్ బోర్డ్‌లో ఉన్న 26వ వార్డులోని 274 పోలింగ్ కేంద్రం పరిధి, నాయక్ నగర్ 33 వ వార్డులోని 148 ,149, 160 పోలింగ్ కేంద్రం పరిధి, 38వ వార్డు 55వ సచివాలయ పోలింగ్ కేంద్రాల పరిధిలో జిల్లా కలెక్టర్ ఎస్ఐఆర్ ను ర్యాం డంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధి కారులు, ఆయా బిఎల్ఓలు, సూపర్వైజర్లు, బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# మట్లి దేవాదాయ భూముల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

## - కుందేటి నరేంద్ర నాయుడు డిమాండ్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లి మండలం మట్లి గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి చెందిన వందేళ్ల నాటి చారిత్రక దేవాదాయ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లడంపై మట్లి గ్రామ ప్రజల తరఫున సామాజిక కార్యకర్త కుందేటి నరేంద్ర నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్లి రామలింగాపురం అగ్రహారానికి చెందిన సుమారు 436.19 ఎకరాల దేవుని ఆస్తిని, గ్రామానికి చెందిన ఒక మాజీ వీఏఓ/వీఆర్ఓ తన అధికార బలంతో ప్రైవేట్ వ్యక్తుల పేరిట, తన కుటుంబ సభ్యుల పేరిట మార్చి అక్రమాలకు పాల్పడినట్లు ఆయన ఆధారాలతో సహా వీరబల్లి తహసీల్దార్‌కు రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా కుందేటి నరేంద్ర నాయుడు మాట్లాడుతూ.. 1860 ఇనాం రికార్డులు, 1910 రీ-సెటిల్మెంట్ రిజిస్టర్ అధికారిక లీగల్ రికార్డుల ప్రకారం మట్లి ఇనాం భూముల ఇనాందారులైన చెంచు సుబ్బమ్మ, ఆదెమ్మలకు ప్రత్యక్ష వారసులు లేరని స్పష్టం చేశారు. బ్రిటీష్ కాలంలోనే ఈ భూముల రికార్డులలో "శ్రీరామ కవచం" అని స్పష్టంగా నమోదు చేశారని, రెవెన్యూ నిబంధనల ప్రకారం వారసులు లేని ఈ భూమి పూర్తిగా శ్రీ కోదండ రామస్వామి మందిర పూజల కొరకు, ఆలయ రక్షణకు అంకితం చేయబడిన "దేవాదాయ/ధర్మ ఇనాం" గా చట్టబద్ధంగా రూపాంతరం చెందిందని ఆయన వివరించారు.

**రికార్డుల తారుమారుపై నరేంద్ర నాయుడు ధ్వజం:**
కేంద్ర ప్రభుత్వం భూముల కంప్యూటరీకరణ (వెబ్‌ల్యాండ్) ప్రక్రియను చేపట్టినప్పుడు, ఈ మాజీ అధికారి తన అధికార బలంతో పెద్ద ఎత్తున రికార్డుల తారుమారుకి పాల్పడ్డారని నరేంద్ర నాయుడు ఆరోపించారు. ఈ ఇనాం భూములు దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లకుండా దేవాదాయ చట్టం సెక్షన్ 43, రిజిస్ట్రేషన్ చట్టం 22-ఎ(1)(ఎ) "నిషేధిత భూముల జాబితా"లో ఎక్కకుండా తొక్కిపెట్టారని మండి పడ్డారు. కోదండ రామస్వామి ఆలయం ఉన్న సర్వే నంబర్ 2164 లోని 0.59 సెంట్ల భూమిని సైతం సదరు మాజీ అధికారి తన సొంత పేరుపై ఆన్లైన్ చేసుకున్నారని, తన కుటుంబ సభ్యుల పేరిట ఏకంగా 62.44 ఎకరాల భూమిని అక్రమంగా నమోదు చేసుకుని, అందులో 41.66 ఎకరాలను ఇతరులకు విక్రయించి పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడ్డారని ఆయన ఆధారాలను బయటపెట్టారు. 1956 ఇనాం రద్దు చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా సృష్టించిన అక్రమ రైత్వారీ పట్టాల ఆధారంగా బ్యాంకులలో ఈ దేవుని భూములను తాకట్టు పెట్టి పెద్ద ఎత్తున రుణాలు కూడా పొందినట్లు ఆయన వెల్లడించారు.

**తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్:**
గతంలో తాము దేవాదాయ శాఖకు, కలెక్టర్‌కి ఇచ్చిన గ్రీవెన్స్ (నెం. KDP202605252130)ను పరిగణనలోకి తీసుకుని, తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న అసలు ఇనాం ఫైళ్లను పరిశీలించాలని కుందేటి నరేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. ఈ 436.19 ఎకరాల భూమిని రక్షించడానికి ఆర్ఓఆర్ చట్టం కింద కేసు ఫైల్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా సృష్టించిన మొత్తం 259 అక్రమ పట్టాదారు ఖాతాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి దేవుని భూములను సొంతం చేసుకుని, రికార్డులు తారుమారు చేసిన మాజీ వీఏఓ/వీఆర్ఓ పై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆ భూములను తిరిగి ఆలయానికి దక్కేలా చర్యలు తీసుకోవాలని, తమకు తక్షణమే అధికారిక ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వేంపల్లెలో అఖండ జ్యోతి శోభాయాత్ర

### - సాయినామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం
### - భక్తుల హృదయాల్లో జ్ఞానజ్యోతి వెలిగించడమే లక్ష్యం: కుంచా సాయినాథ్



**వేంపల్లె - సూర్య వాస్తవం:** శ్రీ సత్యసాయి బాబా దివ్యాశీస్సు లతో శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న 'శ్రీ సత్యసాయి అఖండ జ్యోతి -- స్పిరిట్ ఆఫ్ యూనిటీ రన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం వేంపల్లెలో అఖండ జ్యోతి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంపల్లె మండల శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖండ జ్యోతి, కాగడా దీపం, శ్రీ సత్యసాయి బాబా చిత్ర పటంతో పట్టణ వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. "సత్యసాయి బాబాకి జై" నినాదాలతో భక్తులు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని చాటారు. అనంతరం వేంపల్లెలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని సత్యసాయి భజన మందిరంలో అఖండ జ్యోతిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వ హించారు. ఈ సందర్భంగా కుంచా సాయినాథ్ మాట్లాడుతూ, భక్తుల హృదయాల్లో జ్ఞానాన్ని, ఐక్యతా భావాన్ని వెలిగించడమే అఖండ జ్యోతి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుంచి ప్రారంభమైన ఈ జ్యోతి దేశవ్యాప్తంగా భక్తులకు దర్శనమిస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని చాటుతోందన్నారు. ఈ నెల 26న పుట్టపర్తిలో అఖండ జ్యోతితో పాటు స్పిరిట్ ఆఫ్ యూనిటీ రన్ నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, రాయవరం శివరావు, పుల్లగూర గోవర్ధన్, శంకర్ రెడ్డి, సేవాదళ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వేంపల్లెలో డ్రోన్ నిఘా ముమ్మరం

### - బైపాస్‌తో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక తనిఖీలు
### - ఓపెన్ డ్రింకింగ్, జూదం, మట్కాపై కఠిన చర్యలు తప్పవు
### - సీఐ నరసింహులు హెచ్చరిక




**వేంపల్లె - సూర్య వాస్తవం:** సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని వేంపల్లె సర్కిల్ ఇన్స్పెక్టర్ టీ.నరసింహులు (సీఐ) హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వేంపల్లె పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నిఘా (డ్రోన్ బీట్) నిర్వహించినట్లు తెలిపారు.పట్టణంలోని బైపాస్ రోడ్డు, షాదీఖానా, ప్రియ తోట, చింతరాంపల్లి ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ డ్రోన్ నిఘా చేపట్టినట్లు వివరించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, జూదం, మట్కా నిర్వహించడం వంటి అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం డ్రోన్ బీట్‌ను నిరం తరం కొనసాగిస్తామని తెలిపారు. అలాగే తమ పరిస రాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించడం లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీఐ హామీ ఇచ్చారు.

# టీటీడీకి రూ.41 లక్షలు విరాళం

**తిరుమల - సూర్య వాస్తవం:** టీటీడీకి చెందిన వివిధ పథకాలకు సోమవారం రూ.41 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్ కు చెందిన డాక్టర్ లయన్ సాయి వెంకట్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్ కు స్వర్ణ విహార్ ఇన్ ఫ్రా ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున రూ.10 లక్షలు, జయహో రామానుజ సినిమా ఆగస్టు 15న విడుదల సందర్భంగా మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు.



# జనసేన పార్టీ పదవికి దరఖాస్తు సమర్పించిన యారవ దివ్య

### - పార్టీ అప్పగించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెల్లడి



**కడప - సూర్య వాస్తవం:** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పార్టీ పదవుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఆదివారం కడప నగరంలోని హరిత హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ పార్లమెంట్ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు యారవ దివ్య పార్టీ పదవి కోసం తన దరఖాస్తును జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ పార్లమెంట్ పర్యవేక్షకులు చిలకం మధుసూదన్ రెడ్డికి సమ ర్పించారు. ఈ సందర్భంగా యారవ దివ్య మాట్లాడుతూ, జన సేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, జనసేన పార్టీ పార్లమెంట్ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు తాతంశెట్టి తులసి, జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ పత్తి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థకు 32వినతులు

### - కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి

**తిరుపతి - సూర్య వాస్తవం:** టీటీడీకి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 24మంది వినతులు సమర్పించగా, ఎనిమిది మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా సుందరయ్య నగర్ నందు త్రాగునీటిలో మురుగునీరు కలుస్తోంది పరిష్కరించాలని, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద మురుగునీటి కాలువ బ్లాక్ అయ్యింది పరిష్కరించాలని, తుడా అపార్ట్మెంట్ నందు అనదికారికంగా గుడి నిర్మిస్తున్నారు పరిశీలించాలని, ఒకే ఇంటికి రెండు వాటర్ బిల్లులు వస్తున్నాయని, రైల్వే కాలనిలో రోడ్డు తవ్వి వదిలేశారు శుభ్రం చేయించాలని, వెంకటరమణ లేఔట్ నందు కాలువ పై జరుగుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని, పూల వీధిలో చెత్త తొలగించక పోవడం వలన పురుగులు పడి దుర్వాసన వస్తోందని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, మాలవ్యాజీ స్కూల్ పక్కన అంగన్వాడీ సెంటర్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మారుతీ నగర్ లో చెత్త తొలగించి, కాలువలు శుభ్రం చేయించాలని, ఈట్ స్ట్రీట్ లో బోరు మరమ్మతులు చేపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డి.ఈ.లు వెంకట ప్రసాద్, రమణ, ఏసీపీ పార్వతి ప్రియ, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# పని చేయని ఉద్యోగులకు జీతాలా..?

### - వేంపల్లె గ్రామపంచాయతీలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
### - జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం
### - బీజేపీ నేత గాలి హరిప్రసాద్



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లె గ్రామపంచాయతీలో విధు లు నిర్వహించకుండానే కొందరు ఉద్యోగులు నెలల తరబడి జీతాలు పొందుతున్నారంటూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. ఈ వ్యవహా రంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని కోరుతూ సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వ హించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీలో ఓ వ్యక్తి అధికారిక నియామకం లేకుండానే తాను శానిటరీ ఇన్ స్పెక్టర్‌గా వ్యవహరిస్తూ సిబ్బందిని, అధికారులను ఇబ్బంది లకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విధులకు హాజరు కాకపోయినా అతనికి దాదాపు పది నెలల జీతం చెల్లించడం ప్రభుత్వ నిధుల దుర్వినియోగమేనని విమర్శించారు.గతంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా సస్పెన్షన్‌కు గురైన వ్యక్తికే మళ్లీ జీతాలు చెల్లించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో గ్రామపంచాయతీ ఖజానాకు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ, పని చేయకుండా జీతాలు పొందిన మొత్తాన్ని సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. వేంపల్లె గ్రామపంచాయతీలో పని చేయ కుండా జీతాలు పొందుతున్న వారందరిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, బీజేపీ నాయకులు కాకర్ల భాస్కర్ రెడ్డి, బి.మఠం మండల అధ్యక్షుడు చంద్ర ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై భక్తులను అనుగ్రహించిన శ్రీ సుందరరాజస్వామివారు

## 'అమరావతి ఛాంపియన్‌షిప్--2026' ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ షాప్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వ హించనున్న 'అమరావతి ఛాంపియన్‌షిప్--2026' ప్రచార పోస్టర్లను సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. రాష్ట్రంలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్స హించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలను విజయ వంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా తదితర మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వ హించనున్నట్లు తెలిపారు.జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్--17, అండర్--23 విభాగాల్లో బాలురు, బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన క్రీడా కారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, డిఎల్‌డిఓ లక్ష్మీపతి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి. చంద్రశేఖర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలి

**- అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్,. బాధితుల నుండి అర్జీలు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ, తక్షణమే చట్ట ప్రకారం న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, తీసుకున్న చర్యల నివేదికను వెంటనే కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు తమ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్లలోనే నేరుగా ఫిర్యాదు చేయ వచ్చని సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్లలో ఇచ్చే అర్జీలను కూడా 'పీజీఆర్ఎస్' కిందనే పరిగణించి, ప్రజలకు సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ గారు భరోసా ఇచ్చారు.

## అంగన్వాడీ వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న ఐటీడీపీ వెంకటరమణపై చర్యలు తీసుకోవాలి

**- కడప జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ లీడర్లు ఫిర్యాదు**

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** వీరబల్లి మండలం లో అంగన్వాడి వర్కర్లను బెదిరిస్తూ, వేధింపులకు గురిచేస్తున్న ఐటీడీపీ వీరబల్లి మండల అధ్యక్షుడు కాల్వపల్లి వెంకటరమణ(రమణ)పై చర్యలు తీసుకోవాలని ఏపీ అంగ న్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ లీడర్లు సోమ వారం కడప జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కాల్వపల్లి వెంకటరమణ ఐటిడిపి ముసుగులో వీరబల్లి మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి వర్కర్లను వేధింపులకు గురిచేయడం తగదన్నారు. అంగన్వాడి వర్కర్లు సక్రమంగా సెంటర్లకు వెళ్తున్నా కూడా సెలవులు సమయంలో సెంటర్ వద్దకు వెళ్లి సెంటర్‌కు తాళాలు వేసిన ఫోటోలు తీసి అంగ న్వాడి సెంటర్లు సక్రమంగా పనిచేయలేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సమంజసం కాదన్నారు. రాత్రి వేళల్లో అంగన్వాడి వర్కర్లకు ఫోన్లు చేసి మీపై సోషల్ మీడియాలో పోస్టులు పెడతా అని అసభ్యకరంగా మాట్లాడడం, బెదిరింపులకు దిగడం, అంగన్వాడీ వర్కర్లను మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. తాను ఎస్సీ అని మీ పైనే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని కొందరు అంగన్వాడి వర్కర్లను బెదిరించడం అనేది మంచి పద్ధతి కాదన్నారు. వీరబల్లి మండలంలో నిత్యం ఐటీడీపీ ముసుగులో అంగన్వాడి వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న కాల్వపల్లి వెంకటరమణ పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయం పై త్వరలో సీఎం చంద్ర బాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లను కలిసి వీరబల్లి మండలంలో అంగన్వాడి వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న ఐటిడిపి నాయకులు వెంకటరమణ, అందుకు సహకరిస్తున్న అధికార పార్టీ నాయకులపై ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.



# రాజధాని విషయంలో వైసీపీ, టీడీపీ దొందూ దొందే

- వైకాపాది 'సెల్ఫ్ గోల్'.. టీడీపీది 'సెల్ఫ్ డబ్బా'
- డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి
- అమరావతి ప్రజా రాజధానిగా ఉండాలే తప్ప ఆర్భాటాలకు తావులేదని వ్యాఖ్య



**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ రెండూ ప్రజలను అయోమయంలోకి నెట్టాయని, వైకాపాది "సెల్ఫ్ గోల్" కాగా టీడీపీది "సెల్ఫ్ డబ్బా" అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమ ర్శించారు. సోమ వారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, రాజధాని విషయంలో వైకాపా పదేపదే తన వైఖరిని మార్చుకుంటూ ప్రజల్లో గందర గోళం సృష్టించిందని ఆరోపించారు. 2019 ఎన్నికల సమ యంలో అమరావతినే రాజధానిగా అంగీకరించిన వైకాపా, అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖను రాజధా నిగా ప్రకటించేందుకు ప్రయత్నించి విఫలమైందని, ప్రస్తుతం మరోసారి విజయవాడ పేరును ప్రస్తావించడం ఆ పార్టీ అయోమయానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.టీడీపీ కూడా రాజధాని నిర్మాణంపై అతిగా ప్రచారం చేసుకుంటోందని తులసిరెడ్డి విమర్శిం చారు. విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు తీసుకుని రాజధాని నిర్మాణం చేప ట్టాల్సి ఉండగా, భారీగా అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టడం ప్రజలపై భారం మోపడమేనని అన్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో తాత్కాలిక సచివాలయం నిర్మించి అక్కడి నుంచే పరిపాలన సాగుతుండగా, మళ్లీ భారీ వ్యయంతో శాశ్వత సచివాలయం నిర్మించడం అవసరమా అని ప్రశ్నించారు.

రాజధాని నిర్మాణంలో దుబారా ఖర్చులు, అవినీతి ఆరోపణలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయని పేర్కొన్న ఆయన, భూములు ఇచ్చిన రైతుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం బాధాకరమ న్నారు. మరోసారి భూ సమీకరణ చేపడతామనడం కూడా సమంజసం కాదని అభిప్రాయ పడ్డారు. ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని -- అమరావతి అనే విధా నానికే కాంగ్రెస్ కట్టుబడి ఉందని తులసిరెడ్డి స్పష్టం చేశారు. అమరావతిని ప్రజా రాజధానిగా అభివృద్ధి చేయా లని, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లతోనే మౌలిక వసతులు కల్పిం చాలని, అప్పులపై ఆధారపడకూడదని సూచించారు.

అలాగే రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలను తక్షణమే పరిష్క రించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, అధికార వికేంద్రీ కరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పిజిఆర్ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలి

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** పిజిఆర్ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్య క్రమంలో భాగంగా జిలా లోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలె క్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, డిఎల్‌డిఓ లక్ష్మీపతిలు అర్జీలను స్వీక రించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టా లని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండ రాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్క రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పాజిటివ్ పర్ఫార్మెన్స్ (సానుకూల పనితీరు) ప్రజల నుండి సేకరించే అభిప్రా యాలలో పురోగతి సాధించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పని తీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానం లో ఉండేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.



**ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..**

మదనపల్లి మండలం అమ్మ చెరువు మిట్ట కు చెందిన షేక్ గౌసియా కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న తమ కుమా రుడికి 10 సంవత్సరాలు పుట్టినప్పటి నుండి కాళ్లు చేతులు పని చేయవని సదనం సర్టిఫికెట్ కావాలని, ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం కొరకు అర్జీని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. మదనపల్లి మండలం, బికే పల్లెకు చెందిన టి.చిన్న రామాంజులు తనకు 100 శాతం వైకల్యం ఉన్నదని సొంత ఇల్లు, ఆస్తులు లేవు. కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంది. వికలాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు ను జిల్లా కలెక్టర్ విన్నవించు కు న్నారు. మదనపల్లి మండలం రామారావు కాలనీకి చెందిన పి.రాజ్యలక్ష్మి తన కుమార్తె పి. హేమ శ్రీ గత మూడు సంవత్సరాలుగా ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. అయి నప్పటికీ, నా అనుమతి లేకుండా మదనపల్లె రామారావు కాలనీలోని బాపూజీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి విద్యార్థినిగా ఆన్ లైన్‌లో నమోదు చేసి, తప్పుడు వివరాలు నమోదు చేశారు. అందు వల్ల ప్రైవేటు పాఠశాల పాఠశాలలో అడ్మిషన్ చేసుకోవడం కష్టంగా ఉన్నదని అందువల్ల నా కుమార్తె పేరును వెంటనే ప్రభుత్వ పాఠశాల ఆన్లైన్ రికార్డుల నుండి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 275 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆవాస్ యోజన పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించండి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** ఆవాస్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ పాల్గొన్నారు. ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణాలకు గ్రామ సభ ద్వారా 386 మందిని గుర్తించి ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి అమల వుతున్న పథకాలు పొందపరచాలన్నారు. షఫీ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ప్రభుత్వ అందిస్తున్న పథకాలు అందేటట్టు చూడా లన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సభ పెట్టి లబ్ధిదారు లను ఎంపిక చేసి వారికి పథకాలు అందేటట్టు చూడాల న్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి కాంట్రాక్ట్ రాజు తెలుగు యువత అధ్యక్షులు కొలిమిరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** సమస్యకు పరిష్కారం ఆత్మ హత్య కాదు అని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే విజయం సాధ్యమని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ జప్రోబి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సెక్టార్ ఆధ్వర్యంలో సోమవారం పిల్లలు మహిళలు ఆత్మహత్య నివారణపై స్థానిక బాలసదనంలో అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ప్రతి ప్రాణం చాలా విలు వైనదని ఏదైనా సమస్య తలెత్తితే పరిష్కారానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని తెలియ జేశారు. సమాజంలో వివిధ కారణాలతో మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి, వారికి "నేను న్నాను" అనే భరోసా కల్పిస్తూ అండగా నిలవాలని సూచిం చారు. అలాంటి మానసిక మద్దతు ఆత్మహత్య ఆలోచనల నుంచి వారిని బయట పడేందుకు దోహదపడుతుందని అన్నారు. మహిళా భద్రత సహాయం కోసం181, మానసిక సహాయం కోసం 14416, పిల్లల రక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నెంబర్లు అందు బాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు సుజాత అరుణ అంగన్వాడి వర్కర్లు సోషల్ వర్కర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్

**- ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్**



యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్ట్స్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

## నాగార్జున వందో సినిమాలో టబూ
## నెగెటివ్ షేడ్‌లో ఉంటుందంటూ ప్రచారం



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




## నిర్మాతగా ప్రదీప్ రంగనాథ్ కొత్త అవతారం

వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథ్ ఇప్పుడు నిర్మాతగా అవతారం ఎత్తబోతున్నారు. లవ్ టుడే, డ్రాగన్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఆయన, ఇటీవల విడుదలైన సినిమాతో మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ సినిమా నిరాశపరిచినప్పటికీ ప్రదీప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నటుడు, దర్శకుడు, కథా రచయిత, గేయ రచయితగా తన ప్రతిభను చాటుకున్న ప్రదీప్ రంగనాథన్.. ఇప్పుడు నిర్మాతగానూ అడుగుపెడుతున్నారు. తాజాగా పీఆర్ షో అనే సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆయన, ఆ బ్యానర్‌పై తొలి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో 'ప్రేమలు', 'డ్యూడ్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. దర్శకుడిగా పేరు తెచ్చుకుని, ప్రస్తుతం నటుడిగానూ రాణిస్తున్న అశ్వత్ మారిముత్తు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాతో అనామిక మహి వెండితెరకు పరిచయం కానుండగా, తెలుగు నటుడు శివాజీ సొంటినేని, నటి స్వాసిక ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ 'ది ఆల్ఫా యూనిట్'. ఆరుగురు యువ దర్శకులతో ఫిల్మ్‌మేకింగ్ చేయడం. విశాల్ టీఆర్, యశ్ వి, నరేన్ సౌదా, చాణక్యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించనున్నారు. ఈ వినూత్న ప్రయత్నం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి కథను స్వయంగా ప్రదీప్ రంగనాథన్ అందించగా, యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం సమకూరుస్తున్నారు. సినిమా ప్రకటన సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో నటీనటులు, సాంకేతిక బృందాన్ని పరిచయం చేస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారు.నిర్మాతగా ప్రదీప్ రంగనాథన్ ప్రారంభిస్తున్న ఈ కొత్త ప్రయాణం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



# నార్వే చేతిలో బ్రెజిల్ ఘోర పరాజయం



న్యూయార్క్ న్యూజెర్సీలోని ప్రఖ్యాత మెట్‌లైఫ్ స్టేడియం ఒక చారిత్రక ఘట్టానికి, అదే సమయంలో ఫుట్‌బాల్ ప్రపంచంలోనే ఒక మహా విషాదానికి వేదికైంది. ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో ఐదుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచి, ఎదురులేని శక్తిగా ఎదిగిన బ్రెజిల్ జట్టు, 2026 ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో అనూహ్యంగా నార్వే చేతిలో 2-1 తేడాతో ఊహించని పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఘోర ఓటమితో బ్రెజిల్ ఆరవసారి ప్రపంచ కప్ గెలవాలన్న దశాబ్దాల కలలు శాశ్వతంగా చెదిరిపోయాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే మైదానంలో ఆటగాళ్లు కుప్పకూలిపోయారు. గ్యాలరీలో తమ జట్టుకు మద్దతుగా నిలిచిన వేల మంది బ్రెజిల్ అభిమానులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మ్యాచ్ ప్రారంభం నుంచే రెండు జట్ల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు కనిపించింది. బ్రెజిల్ ఆటగాళ్లు తమదైన చురుకైన శైలిలో దాడులు ప్రారంభించారు. ఆట 13వ నిమిషంలో నార్వే డిఫెండర్ క్రిస్టోఫర్ అజెర్.. బ్రెజిల్ స్ట్రైకర్ మాథ్యూస్ కున్హాను పెనాల్టీ బాక్స్‌లో ఫౌల్ చేయడంతో, వీడియో అసిస్టెంట్ రిఫరీ సమీక్ష తర్వాత బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. అయితే బ్రూనో గిమారేస్ కొట్టిన ఆ కీలకమైన పెనాల్టీ కిక్‌ను నార్వే సీనియర్ గోల్ కీపర్ ఓర్జన్ నైలాండ్ ఎడమవైపునకు డైవ్ చేసి అత్యద్భుతంగా అడ్డుకున్నాడు. బ్రెజిల్ పదేపదే చేసిన దాడులను నైలాండ్ ఒక ఇనుప గోడలా అడ్డుకుంటూ తొలి అర్ధభాగం ముగిసేసరికి స్కోరు 0-0 వద్ద నిలిచేలా చేశాడు. వినీసియస్ జూనియర్, గాబ్రియేల్ మార్టినెల్లి, రేయాన్ వంటి ప్రపంచ స్థాయి స్ట్రైకర్లు చేసిన అనేక గోల్ ప్రయత్నాలు నైలాండ్ అమోఘమైన ప్రతిభ ముందు విఫలమయ్యాయి. రెండవ అర్ధభాగంలో బ్రెజిల్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన యువ కెరటం ఎండ్రిక్, మైదానంలో అడుగుపెట్టిన 52 సెకన్లకే వినీసియస్ జూనియర్ ఇచ్చిన పాస్‌తో ఒక సువర్ణ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఆ తర్వాత నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలండ్ బ్రెజిల్ రక్షణ వలయాన్ని ఛేదించడం మొదలుపెట్టాడు. 79వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ఆండ్రియాస్ స్చెలెడెరుప్ అందించిన అద్భుతమైన క్రాస్‌ను హాలండ్ అత్యంత వేగంగా అద్భుతమైన హెడర్ ద్వారా గోల్‌గా మలిచాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. బ్రెజిల్ ఆటగాళ్లలో అప్పటికే తీవ్రమైన ఒత్తిడి పెరిగిపోయింది. ఆ ఒత్తిడిని, బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను క్యాష్ చేసుకున్న హాలెండ్, 90వ నిమిషంలో బ్రెజిల్ డిఫెండర్ డానిలో కాళ్ల మధ్యలోంచి బంతిని పంపి, గోల్ కీపర్ అలిసన్‌ను ఏమార్చుతూ మరో అద్భుతమైన గోల్ సాధించి స్కోరును 2-0 చేశాడు. ఈ రెండు గోల్స్‌తో హాలెండ్ ఈ వరల్డ్ కప్ టోర్నీలో కేవలం నాలుగు మ్యాచుల్లోనే తన గోల్స్ సంఖ్యను ఏడుకు పెంచుకున్నాడు. మ్యాచ్ నిర్ణీత సమయం ముగిసిన తర్వాత రిఫరీ ఇచ్చిన సుదీర్ఘ స్టాపేజ్ టైమ్‌లో బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్మార్ ఒక పెనాల్టీ ద్వారా గోల్ సాధించాడు. కానీ అప్పటికే జరగాల్సిన ఘోర నష్టం జరిగిపోయింది. అది కేవలం ఓదార్పు గోల్‌గా మాత్రమే మిగిలిపోయింది. రిఫరీ ఫైనల్ విజిల్ వేయగానే బ్రెజిల్ ఆటగాళ్లు మైదానంలోనే మోకాళ్లపై కూలబడి, పిచ్ పై పడుకుని ఏడ్చేశారు. నెయ్మార్, వినీసియస్ జూనియర్, అలిసన్ బెక్కర్ వంటి దిగ్గజ స్టార్లు తమ జెర్సీలతో ముఖాలు దాచుకుని వెక్కి వెక్కి కన్నీరు పెట్టుకున్నారు. స్టేడియంలో ఉన్న పసుపు-ఆకుపచ్చ రంగుల బ్రెజిల్ అభిమానులు తమ ఆరాధ్య జట్టు ఓటమిని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. ఎన్నో ఆశలతో వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చిన వారు, తమ దేశపు కల ఇలా ముగిసిపోవడంతో కన్నీరు కార్చారు. 1990 తర్వాత బ్రెజిల్ ఇంత త్వరగా రౌండ్ ఆఫ్ 16 దశలోనే వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించడం ఇదే తొలిసారి. మరోవైపు, తమ దేశ చరిత్రలో తొలిసారిగా వరల్డ్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న నార్వే ఆటగాళ్లు, వారి అభిమానులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. బ్రెజిల్ లాంటి అగ్రశ్రేణి జట్టును మట్టికరిపించిన నార్వే అద్భుత విజయం ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.



## శ్రీలంకపై అన్వయ్ ద్రవిడ్ మెరుపు ఇన్నింగ్స్..

**67 బంతుల్లో 87 పరుగులతో రాణించిన అన్వయ్**



భారత క్రికెట్ దిగ్గజం, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ క్రికెట్ వారసత్వాన్ని ఆయన చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ ఘనంగా ముందుకు తీసుకెళుతున్నాడు. శ్రీలంక అండర్-19 జట్టుతో నేడు జరిగిన రెండో యూత్ వన్డేలో ఈ యువ వికెట్ కీపర్-బ్యాటర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. మహింద రాజపక్స అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేవలం 67 బంతుల్లోనే 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 19వ ఓవర్ ముగిసేసరికి 81 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్, మరో బ్యాటర్ అర్జున్ రాజ్‌పుత్ (76 పరుగులు) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 145 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా అన్వయ్ దూకుడుగా ఆడుతూ కేవలం 47 బంతుల్లోనే తన తొలి యూత్ వన్డే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడు చూసి శతకం ఖాయమనిపించినా, శ్రీలంక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గిమ్హాన్ మెండిస్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 129.85 స్ట్రైక్ రేట్‌తో ఆడిన అన్వయ్ ఇన్నింగ్స్ జట్టు స్కోరును పరుగులు పెట్టించింది. అర్జున్ రాజ్‌పుత్ కూడా 81 బంతుల్లో 76 పరుగులు చేసి రాణించాడు. అయితే, దిమంత మహవితాన అద్భుతమైన త్రోకు అతను రనౌట్‌గా వెనుదిరిగాడు. కీలక భాగస్వామ్యం విడిపోయిన తర్వాత భారత ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. 263 పరుగుల వద్ద ఏడో వికెట్‌గా అన్వయ్ ఔటైన తర్వాత, భారత టెయిలెండర్లు చేతులెత్తేశారు. కేవలం 22 పరుగుల వ్యవధిలో చివరి మూడు వికెట్లు కోల్పోయి 47.2 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో గిమ్హాన్ మెండిస్ 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి భారత్‌ను కట్టడి చేశాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది. తొలి మ్యాచ్‌లో 321 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీలో కర్ణాటక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అన్వయ్, ఆ టోర్నీలో 220 పరుగులు చేసి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఈ ప్రదర్శనతో రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌కు ఎంపికయ్యే అవకాశాలను మరింత మెరుగుపరుచుకున్నాడు. కాగా, అన్వయ్ అన్నయ్య సమిత్ ద్రవిడ్ కూడా ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపికైనా మోకాలి గాయం కారణంగా దూరమయ్యాడు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

చిత్తూరు, తిరుపతి

మంగళవారం
07 జులై 2026
8

# ప్రకృతి పరిరక్షణే భావితరాలకు గొప్ప కానుక

- నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా 'ప్రకృతి మిత్ర' కార్యక్రమం
- విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించిన ఏజీఎం రియాజ్
- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి హరితహారం సందేశం
- ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపు




**నాయుడుపేట– సూర్య వాస్తవం:** ప్రకృతిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, నేటి చిన్నారులే రేపటి పర్యావరణ పరిరక్షకులని నాయుడుపేట నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏజీఎం రియాజ్ పేర్కొన్నారు. నాయుడుపేటలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం "ప్రకృతి మిత్ర" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణపై తమ బాధ్యతను చాటిచెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజీఎం శ్రీ రియాజ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత వంటి సమస్యలు ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యల ద్వారా ప్రకృతిని కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులు అవుతారని పేర్కొన్నారు.




అనంతరం విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. "ఒక్క విద్యార్థి -- ఒక మొక్క", "చెట్లను పెంచుదాం -- ప్రకృతిని కాపాడుదాం", "పచ్చదనం పెంచి భవిష్యత్తును రక్షిద్దాం" వంటి నినాదాలతో విద్యార్థులు ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ర్యాలీ అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకే అప్ప గిం చారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని దానిని సంరక్షించాలని, మొక్కలు పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం, పచ్చని భూమిని భావితరాలకు అందించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ, విద్యతో పాటు సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో పెంపొందించడం కూడా విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్య క్రమాలను తరచూ నిర్వహిస్తున్నామని చెప్పారు. కోఆర్డి నేటర్ ప్రిసిల్లా, ఏఓ గౌస్ భాషా, వైస్ ప్రిన్సిపాల్స్ జయశ్రీ, చరణ్య, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరించారు. చివరగా విద్యార్థులు ప్రకృతిని కాపాడేందుకు, మొక్కలను నాటి సంరక్షించేందుకు, పరిశుభ్రమైన పర్యావరణ నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడంలో ఈ "ప్రకృతి మిత్ర" కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# జనసేన విస్తరణ ఆశలు...




**విశాఖపట్టణం–సూర్య వాస్తవం:** ఏపీలో మరో నెల రోజులలో మంత్రి వర్గ విస్తరణ జరుగుతుంది అని ప్రచారం జోరుగా సాగుతోంది. ఆగస్టు నెలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని అపుడు విస్తరణ చేపడతారు అని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం మంత్రి వర్గంలో 24 మంది ఉన్నారు. ఒక బెర్త్ ఖాళీగా ఉంది. అయితే కొత్తగా చేపట్టే విస్తరణరలో కనీసంగా అరడజన్ మందిని తీసుకుంటారు అని వార్తలు వినవస్తున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వంలో మిత్ర పార్టీలు అయిన జనసేనకు బీజేపీకి మరింత ప్రాతినిధ్యం లభిస్తుంది అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జనసేన విషయం తీసుకుంటే రెండు బెర్తులు అదనంగా కేటాయిస్తారు అని అంటున్నారు. జనసేనకు ఇప్పటికే ముగ్గురు మంత్రులు ఉన్నారు. కొత్తగా విస్తరణ తరువాత ఈ సంఖ్య ఐదుకు చేరువ అవుతుందని అంటున్నారు. ఇక జనసేనలో ఇప్పటికే పవన్ ఉప ముఖ్యమంత్రిగా కీలక హోదాలో ఉన్నారు. ఆయనకు అయిదు ప్రాధాన్యత కలిగిన శాఖలను కేటాయించారు. అలాగే మరో రెండు బెర్తులు కూడా ఇచ్చారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్ పనిచేస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ ఉన్నారు. వీరితో పాటు మరో ఇద్దరు జత చేరుతారు అని అంటున్నారు. సీనియర్ నేత అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామక్రిష్ణకు గోల్డెన్ చాన్స్ దక్కుతుందని అంటున్నారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చే విషయంలో పవన్ కళ్యాణ్ అనేక సమీకరణలను చూసి మరీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు అని అంటున్నారు. ఉత్తరాంధ్రాలో ప్రముఖ బీసీ నేతగా కొణతాల ఉన్నారు. విశాఖ జిల్లాలో మూడు నుంచి నాలుగు అసెంబ్లీ అలాగే అనకాపల్లి ఎంపీ సీటుని ప్రభావితం చేసే బలమైన గవర సామాజిక వర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహిస్తున్నారు. ్తరాంధ్రాలో జనసేనను విస్తరించాలని రానున్న కాలంలో జనసేనను ఆ ప్రాంతంలో మరింతగా బలం పెంచేలా చేయాలని పవన్ వ్యూహ రచన చేస్తున్నారు.

బీసీల జిల్లాలుగా ఉన్న ఉత్తరాంధ్రా నుంచి వివాద రహితుడు ఉత్తరాంధ్రా సమస్యల మీద పూర్తి అవగాహన ఉన్న రామక్రిష్ణకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా రానున్న కాలంలో ఉత్తరాంధ్రాలో పట్టు పెంచుకోవాలని పవన్ చూస్తున్నారు అని అంటున్నారు. జనసేన రాజకీయ పరంగా చూస్తే పవన్ కనుక కొణతాలను ఎంచుకుంటే అది వ్యూహాత్మకంగా సరైన నిర్ణయం అవుతుందని అంటున్నారు. జనసేనకు రానున్న రోజులలో ఉత్తరాంధ్రాలో పట్టు మరింతగా పెరిగేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అంటున్నారు. క్కడ మరో ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. మెగా బ్రదర్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుకు మంత్రి పదవి దక్కుతుంది అన్నదే ఆ ప్రచారం సారాంశం. ఆయన ఎమ్మెల్సీగా నెగ్గింది మంత్రి కావడానికి అని చెప్పుకున్నారు. ఇక చంద్రబాబు సైతం నాగబాబుని కేబినెట్ లోకి తీసుకుంటామని కూడా గతంలో హామీ ఇచ్చారు. ఆ విధంగా చూస్తే జనసేనకు మరో రెండు మంత్రి పదవులు దక్కినట్లే అని అంటున్నారు. ప్రభుత్వంలోనూ జనసేన వాయిస్ కూడా బాగా పెరుగుతుందని అలాగే పార్టీ పరంగా జనసేన మరింత పటిష్టం అయ్యేందుకు దోహదపడుతుందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే కొణతాలకు గోల్డెన్ చాన్స్ దగ్గరలోనే ఉంది అని అంటున్నారు.

## ఏపీలో పోలీసింగ్ విప్లవం..
### - సర్కార్ కీలక నిర్ణయి




**గుంటూరు–సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేసేందుకు మరియు పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా రక్షణ వ్యవస్థను ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా మరో మూడు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసేందుకు అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం జిల్లా ఎస్పీల పరిధిలో ఉన్న తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాలను పూర్తి స్థాయి పోలీస్ కమిషనరేట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. నగరాల శరవేగవంతమైన విస్తరణ, మారుతున్న నేరాల స్వరూపం, ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా అదుపు చేయడమే లక్ష్యంగా ఈ కీలక అడుగు పడింది. ఈ నూతన కమిషనరేట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలంటూ రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా రంగంలోకి దిగారు. తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాల ఎస్పీలకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత కమిషనరేట్లకు సంబంధించిన భౌగోళిక సరిహద్దులు, కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ప్రత్యేక పోలీస్ వింగ్స్, శాంతిభద్రతల నిర్వహణకు కావలసిన సిబ్బంది సంఖ్య మరియు మౌలిక వసతుల లభ్యతపై సమగ్రమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ పూర్తి స్థాయి నివేదికలను వీలైనంత త్వరగా మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని డీజీపీ ఆదేశించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో మాత్రమే కమిషనరేట్ వ్యవస్థ విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పుడు కొత్తగా తిరుపతి, గుంటూరు, రాజమండ్రి నగరాలు కూడా ఈ జాబితాలో చేరితే పట్టణ ప్రాంతాల్లో పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది. కమిషనరేట్ వ్యవస్థ అమలులోకి వస్తే ఐపీఎస్ కేడర్ అధికారులు నేరుగా కమిషనర్‌గా బాధ్యతలు చేపడతారు, దీనివల్ల నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి, ఆధునిక సాంకేతికతతో నేరాలను అదుపు చేయడానికి వీలవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## గాదె సాయికృష్ణ కేసుకీలక సాక్ష్యాలు

**విజయవాడ– సూర్య వాస్తవం:** విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ హత్య కేసు దర్యాప్తులో ఊహించని పరిణామాలు వెలుగులోకి వస్తున్నాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై క్లూస్ టీమ్ మరియు సిట్ అధికారులు జరిపిన తనిఖీల్లో లభించిన మానవ ఎముకల అవశేషాలు, బూడిద, ఒక స్టీల్ బ్రాస్‌లెట్, కాలిన వస్తువులను కేసులో అత్యంత కీలకమైన సాక్ష్యాలుగా గుర్తించారు. నిందితులు నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి పోలీస్ స్టేషన్ భవనంపైనే సాయికృష్ణ శవాన్ని దహనం చేశారనే అనుమానాలు బలపడుతున్న నేపథ్యంలో, దొరికిన ఆధారాలు చట్టపరంగా నిలబడేలా చేసేందుకు న్యాయాధికారి (మెజిస్ట్రేట్) సమక్షంలో వాటికి పక్కాగా సీల్ వేసి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కి తరలించారు. ఈ కేసులో లభించిన శరీర అవశేషాలు మరియు ఎముకలు ఖచ్చితంగా గాదె సాయికృష్ణవేనా కాదా అనే విషయాన్ని శాస్త్రీయంగా నిరూపించడం పోలీసులకు ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది. ఎముకలు పూర్తిగా కాలిపోయి ఉండటంతో కేవలం ఫోరెన్సిక్ నివేదిక ద్వారానే అసలు నిజాలు బయటకు రానున్నాయి. టెర్రస్‌పై దొరికిన స్టీల్ బ్రాస్‌లెట్ సాయికృష్ణ ధరించేదేనని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, కోర్టులో నిందితులకు శిక్ష పడాలంటే పక్కా సైంటిఫిక్ నివేదిక అవసరం కాబట్టి సిట్ అధికారులు ఫోరెన్సిక్ విశ్లేషణపైనే పూర్తి నిఘా పెట్టారు. అవశేషాల గుర్తింపును వంద శాతం చట్టబద్ధంగా ఖరారు చేసేందుకు సిట్ అధికారులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి యొక్క డీఎన్‌ఏ నమూనాలను సేకరించి, వాటిని కృష్ణలంక పీఎస్ టెర్రస్‌పై లభించిన ఎముకల నుంచి తీసే డీఎన్‌ఏతో సరిపోల్చాలని యోచిస్తున్నారు. ఈ డీఎన్‌ఏ రిపోర్ట్ గనుక మ్యాచ్ అయితే, పోలీస్ స్టేషన్ భవనంపైనే హత్య లేదా శవదహనం జరిగిందనే భయంకరమైన నిజం అధికారికంగా నిర్ధారణ అవుతుంది. ఈ ఫోరెన్సిక్ మరియు డీఎన్‌ఏ నివేదికల ఆధారంగానే సిట్ అధికారులు తదుపరి చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు.

## వైసీపీ డ్యామేజ్ కంట్రోల్ ఎలా

**ఒంగోలు–సూర్య వాస్తవం:** ఇటీవల జరుగుతున్న పరిణామాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. మతపరంగా, కులపరంగా కొందరు చేస్తున్న వ్యాఖ్యలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మెడకు చుట్టుకుంటున్నాయి. కొన్ని వర్గాలను ఆ పార్టీకి దూరం చేస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా ఒక మీడియా ఉంది. సోషల్ మీడియా సైన్యం ఉంది. ఇటీవల మతపరంగా, కుల పరంగా కొందరు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అటువంటి వ్యక్తులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సాయం అందిస్తుంది అన్నది ఒక ప్రధాన ఆరోపణ. ఆపై ఆ సెక్షన్ మీడియాలో సైతం ఆ వ్యక్తులకు ఎనలేని ప్రాధాన్యం లభిస్తుంది. అయితే ఇక్కడే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డంగా బుక్ అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై హిందూ వ్యతిరేక ముద్ర ఉంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే హిందుత్వవాదం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారు ఉన్నారు. అటువంటి వారిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తోంది, ప్రోత్సహిస్తోంది అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో హిందూ వ్యతిరేక ముద్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విపరీతంగా పెరిగిపోతోంది ప్రధాన ప్రతిపక్షం పాత్ర ఉంటుంది. ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. పార్టీ కార్నర్ అవుతోంది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )